TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 72 | 04 ఆదివారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే ఓట్ల తొలగింపు: వీహెచ్

- ఎన్నికల సంఘాన్ని కేంద్రం గుప్పిట్లో పెట్టుకుందని వీహెచ్ విమర్శ
- రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే ఓట్ల తొలగింపు అని మండిపాటు
- ఓబీసీల గణన చేపట్టడం లేదని ఆగ్రహం



లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే

రద్దు చేయాలి...

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


...మిగతా 2 లో...



ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత్‌కు

స్వర్ణ పతకం...

- ఆసియా క్రీడల క్రికెట్ విజేత టీమిండియా... ఇది దేశానికే ఆనందకరమన్న ప్రధాని మోదీ...



- పైనల్లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం
- వరుసగా రెండోసారి ఆసియా క్రీడల స్వర్ణాన్ని నిలబెట్టుకున్న టీమిండియా
- అద్భుత హాఫ్ సెంచరీలతో రాణించిన అభిషేక్ శర్మ, తిలక్ వర్మ
- విజేతగా నిలిచిన భారత జట్టును అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం తెలిసిందే. జపాన్‌లోని నిషిన్‌లో శనివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడిని నిలబెట్టుకుని సత్తా చాటింది. ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ భారత జట్టును అభినందించారు. ఇది దేశానికి ఎంతో ఆనందకరమైన సందర్భమని కొనియాడారు. "భారత్‌కు మళ్లీ స్వర్ణం దక్కింది! ఆసియా క్రీడల్లో వైటిల్ నిలబెట్టుకున్న మన పురుషుల క్రికెట్ జట్టుకు అభినందనలు. భవిష్యత్తులోనూ జట్టు సభ్యులు మరిన్ని విజయాలు సాధించాలి" అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు, ఐసీసీ ఛైర్మన్ జై షా కూడా జట్టును అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ...మిగతా 2 లో...

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో

కీలక నిర్ణయం..!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. ...మిగతా 2 లో...

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే..

వదంతులు నమ్మొద్దు

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి



తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరా నాలకు తెరదింట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధి లోని తన స్వగ్రామం తాటిపాములలో అభి వృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ...మిగతా 2 లో...



పిల్లల ఆన్‌లైన్ భద్రతకు

ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన



డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు...

TGTEL/26/A5513
వార్త దీపిక

నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే ఓట్ల తొలగింపు: వీహెచ్

నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఈ కుట్రను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (ఈసీ) తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగింపజేస్తున్నారని వీహెచ్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేయాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జనాభా గణన జరుగుతున్నా, అందులో ఓబీసీల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు.ఈ అంశంపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని వీహెచ్ ప్రకటించారు. రేపు శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి, 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడేందుకు ఇదే చివరి అవకాశమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రం ఓబీసీ గణన చేపట్టేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

హుజురాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన విస్తృత స్థాయి సమావేశం



వార్త దీపిక న్యూస్ :

హుజురాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన విస్తృత స్థాయి సమావేశం తెలంగాణ రక్షణ సేన పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ ఇంచార్జ్ సంతోష్ కుమార్ యాదవ్ గారి అధ్యక్షతన హుజురాబాద్ పట్టణంలోని రెడ్డి కాలనీలో నిర్వహించారు.ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, నాయకులు--కార్యకర్తల సమన్వయం, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల మధ్య ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన ముఖ్య నాయకులు బుర్ర నటరాజ్ గారు, పట్టణ అధ్యక్షులు కోరపల్లి సురేష్ గారు, వేముల మాధవి గారు, రొంటల రాజ్‌కుమార్ గారు, బింగి కార్తీక్ గారు, జంపాల రితేష్ గారు, కోర్నే ధర్మారెడ్డి గారు, బండ అశోక్ గారు, జి. కిరణ్ గారు, అంబాలా హరీష్ గారు, నీలి అనిల్ గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ, హుజురాబాద్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తల సహకారంతో సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు

పెరటాసి మాసం మూడో శనివారం.. తిరుమలకు పోటెత్తిన భక్తులు

సర్వదర్శనానికి 30 గంటలకు పైగా నిరీక్షణ సమయం

ఆక్టోపస్ భవనం వరకు కిలోమీటర్ల మేర విస్తరించిన క్యూలైన్లు

గోవింద నామస్మరణతో మార్మోగుతున్న సప్తగిరులు

భక్తుల కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు

పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసంలో, ముఖ్యంగా శనివారం నాడు స్వామివారిని దర్శించుకునేందుకు తమిళనాడుతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి.శనివారం ఉదయం నాటికి శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించిన అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 30 గంటలకు పైగా సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు అంచనా వేస్తున్నారు. పెరటాసి మాసం విష్ణుమూర్తి ఆరాధనకు ఎంతో పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలోని శనివారాల్లో శ్రీవారిని దర్శించుకుంటే విశేష ఫలాలు దక్కుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతీయేటా ఈ సమయంలో తిరుమలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.కాగా, శుక్రవారం (అక్టోబర్ 2) నాడు 78,445 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,098 మంది తలనీలాలు సమర్పించుకోగా, హుండీ ద్వారా రూ. 4.30 కోట్ల కానుకలు సమకూరాయి. అదేవిధంగా, 4.16 లక్షల లడ్డూలు విక్రయించగా, 3.30 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అశ్విని ఆసుపత్రిలో 4,818 మంది వైద్య సేవలు పొందారు. ఈ గణాంకాలు తిరుమలలో భక్తుల రద్దీ ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్నవారికి నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భక్తులు సంయమనంతో వ్యవహరించి టీటీడీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతా బాగుందనుకుంటే ప్రమాదమే.. రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్

ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా

ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి

వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన

ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు.అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

అట్టహాసంగా శాలివాన డిగ్రీ కాలేజ్ ఫ్రెషర్స్ డే

తాండూర్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలోని తులసి గార్డెన్ లో శాలివాహన డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించే ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేషాద్రి ముదిల్లి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనది అన్నారు. చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ పి శరత్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకొని బాధ్యతాయుటమైన పౌరులుగా ఎదగాలని అన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు కల్వ రాధాకృష్ణ, కరస్పాండెంట్ ఎం మాణిక్యం, డైరెక్టర్లు కటకం వీరేందర్, బంటారం సుధాకర్, నాగారం మల్లేశం, రాధమ్మ,అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టి విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు

తాండూర్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలోని నంబర్ 2 ప్రభుత్వ ప్రైమరీ హైస్కూల్లో విద్యార్థుల పట్ల జరుగుతున్న నిర్లక్ష్యం, సిలబస్ పూర్తి కాకపోవడం మాలిక వసతుల లోపం, ఎస్సీ,ఎస్టీ హాస్టల్ విద్యార్థులపై జరుగుతున్న వివక్షను నిరసిస్తూ శనివారం స్థానిక మండల విద్యాధికారికి పిడిఎస్యూ, ఐఎఫ్ టియూ సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని వాసములు శుభ్రంగా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం అత్యంత దారుణంగా నాణ్యత లేకుండా ఉందని దీనివల్ల చిన్నారుల ఆరోగ్య సమస్యలు వారిని పడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యల పైన విద్యాధికారి స్పందించి పరిష్కరించాలని కోరారు.



స్వర్ణ పతకం...

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 28 బంతుల్లో 61 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. పాకిస్థాన్‌పై టీ20ల్లో ఒక భారత బ్యాటర్ చేసిన వేగవంతమైన అర్ధ సెంచరీ ఇదే. ఆ తర్వాత తిలక్ వర్మ 22 బంతుల్లోనే 51 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరును పరుగులు పెట్టించాడు. వీరితో పాటు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే కూడా రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. అనంతరం 212 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగా పోరాడింది. ఆ జట్టు బ్యాటర్ హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. ఒక దశలో పాకిస్థాన్ గెలుపు దిశగా సాగుతున్నట్లు కనిపించినా, భారత బౌలర్లు చివరిలో ఒత్తిడిని జయించారు. కీలక సమయంలో వికెట్లు తీసి మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకున్నారు. చివరి బంతికి నవాజ్‌ను శివమ్ దూబే ఔట్ చేయడంతో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 6 వికెట్ల నష్టానికి 192 పరుగుల వద్ద ముగిసింది. దీంతో భారత ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు.

లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే

రద్దు చేయాలి...

మొదటిపేజీ తరువాయి

కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు.ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్లేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు.ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో

కీలక నిర్ణయం..!

మొదటిపేజీ తరువాయి

షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది..!

మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

మొదటిపేజీ తరువాయి

చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా గణేష్

చౌటకూర్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బోడపట్ల గణేష్ ను నియామించడం జరిగింది. తమ నియామకం పట్ల స్థానిక మంత్రి దామోదర్ రాజనర్సింహకు అభినందనలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి దామోదర్ రాజనర్సింహా చేతుల మీదుగా గణేష్ నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీ పెద్దలకు, నాయకుల, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

జీర్లపల్లి గ్రామంలో జీవ వైవిధ్య నూతన కమిటీ ఎన్నిక

జహీరాబాద్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

ఝరాసంఘం మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో శుక్రవారం జీవ వైవిధ్య నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ గా గ్రామ సర్పంచ్. అమరేశ్వరి శివమణి, ప్రధాన కార్యదర్శి శివశంకర్, కమిటీ సభ్యులుగా పోలీస్ సంగమేశ్వర్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్ కుమార్, ప్రేమలమ్మ, రంగమ్మను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ అమరేశ్వరి శివమణి మాట్లాడుతూ జీవవైవిధ్యం అనగా భూమిపై గల వివిధ రకాల జీవ జాతులు, జీవవైవిధ్యం భవిష్యత్ తరాలకు అపారమైన విలువ కలిగిన ఆస్తి అయితే మానవ కార్యకలాపాల ద్వారా జాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి జీవవైవిధ్యం నశించిపోతుందని వివరించారు. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని జీవవైవిధ్యం పై ప్రజలలో అవగాహన పెంచటానికి ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం మే 22న అంతర్జాతీయ వైవిధ్య దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించింది. 2025 అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం ఇతివృత్తం ప్రకృతితో సామరస్యం స్థిరమైన అభివృద్ధి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు ఆశీర్వాదం, రాజు, రమేష్, అనీఫ్, ఉస్మాన్, కిష్టయ్య, రాములు, విఠల్, రామ్ చందర్, పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్

జహీరాబాద్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు సొంతింటి కల నేరవేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ అన్నారు. మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో బుక్క సలీమా బేగం అంజద్ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ్ శంకర్ పాటిల్, హన్మంతురావు పాటిల్. మాట్లాడుతూ పేదల కళ్ళలో ఆనందం చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నీరు పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలంతో పాటు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీర్లపల్లి మాజీ సర్పంచ్ రాంరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉస్మాన్, మోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రవీందర్ రెడ్డి, నరసింహారెడ్డి, నిజాముద్దీన్, వాజీద్, నర్సింలు పాటిల్, బోపన్ పల్లి సర్పంచ్ అమృత్, అంజద్, లక్ష్మణ్, సంగమేష్, ధనరాజ్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిర్వాస్తు విద్యాపీఠం లో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం



వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి దంపతులు

2700 మంది మహిళలతో సామూహిక వ్రతం

సంగారెడ్డి, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

మండల పరిధిలోని జిల్లా ఫసల్‌వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణ లో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు. అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు



క్రీడలతోనే గుర్తింపు

తాండూర్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 27 28 తేదీల్లో జరిగిన అస్మిత ఖేల్ లొ ఇండియా ఉమెన్స్ 10 కిలోమీటర్ల రోడ్డు సైక్లింగ్ పోటీల్లో వికారాబాద్ జిల్లా తాండూరు కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొని నారీ శక్తిని చాటి మెడల్స్ సాధించిన ఆర్ శ్రావణి, కాజల్ సిహెచ్ నందిని భాయ్ పీటి బాలమణులకు రాష్ట్రస్థాయిలో పాల్గొన్న బాలికలు పల్లవి, నందిని అక్షర,నిహారికలను శనివారం పాఠశాల ఎస్ఓ ఆశలత అధ్యక్షతన జరిగిన అభినందన సభలో నారాయణపేట జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి బి గోపాల్ మెడల్స్ సాధించిన సైక్లింగ్ రైడర్స్ కు మెడల్స్ సర్టిఫికెట్లు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. పీటి బాలమణి వలన పాఠశాల కీర్తి ప్రతిష్టలు పెరిగిందని సంతోషాన్ని వ్యక్తం చేస్తూ క్రీడలకు సహకారం అందిస్తున్న గోపాలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సవిత, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు



బోరేగావ్ లో గాంధీ జయంతి ఉత్సవాలు

జహీరాబాద్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారంల ఝరాసంగం మండల పరిధిలోని బోరెగావ్ గ్రామంలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామసభలో సర్పంచ్ నాగేంధర్ పాటిల్, ఉప సర్పంచ్ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ గ్రామసభలో గ్రామ పెద్దలు పట్లోళ్ల సంగన్న పాటిల్, సాగర్ పాటిల్, మైనుద్దీన్, రామోజీ సుభాష్, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పరిసరాల పరిశుభ్రత మరియు పలు సామాజిక అంశాలపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించారు.



ఘనంగా కోమల్ జనని హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

సంగారెడ్డి, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలోని కోమల్ జనని హాస్పిటల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ కోమల్ జిత్ రాకేష్ ఆధ్వర్యంలో వికలాంగులకు 30 వీల్‌చైర్లు, యువతకు 100 హెల్మెట్లను అందజేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. హాస్పిటల్ ప్రారంభమైన ఏడాది కాలంలో అందించిన వైద్య సేవలను గుర్తుచేసుకుంటూ యాజమాన్యం,సిబ్బంది, వైద్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, యువత, స్థానికులు పాల్గొన్నారు.





పేదల దాహాన్ని తీర్చిన ధాత డాక్టర్ సంపత్ కుమార్

తాండూర్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలోని 2వ వార్డు బుడగ జంగం కాలనీలో తాగునీటి సమస్యను తీర్చేందుకు శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వ్యవస్థాపకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ సంపత్ కుమార్ ముందుకు వచ్చారు. చాలా రోజులుగా బుడగ జంగం కాలనీలో తాగునీరు కోసం ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని డాక్టర్ సంపత్ కుమార్ తెలుసుకొని వెంటనే సానుకూలంగా స్పందించి, డాక్టర్ తన సొంత ఖర్చులతో శనివారం కాలనీలో బోరు వేయించారు. బోరు నీరు తాగడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ సంపత్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 167 సార్లు రక్తదానం చేసిన మహనీయుడు ఇప్పుడు పేదల దాహాన్ని తీర్చి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం డివిజనల్ కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్ సీనియర్ రిపోర్టర్ లక్ష్మణ్ వార్డ్ కౌన్సిలర్ రమేష్, మోడీ కృష్ణ, దత్తు, రమేష్, దస్తప్ప బాబు, శేఖర్, అంజిలి తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

వికాస్ ఒకేషనల్ కళాశాల ప్రారంభం

విద్యార్థుల స్కిల్ అభివృద్ధికి శిక్షణ

రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా

సంగారెడ్డి, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

విద్యార్థుల భవిష్యత్ కోసం, వారి స్కిల్ డెవలప్మెంట్ కోసం ప్రత్యేకం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టణంలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ కళాశాలలోని ఒకేషనల్ ట్రైనింగ్ విభాగాలను పరిశీలించారు. కాలేజీలో కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి గా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కోసం అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఐటిఐలను ఆధునికరిస్తున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు వివిధ దేశాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపనీస్ లాంగ్వేజ్ లలో ప్రభుత్వం శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాన్ని, భాషా ప్రావీణ్యత ను పెంచుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు. ఆధునిక సౌకర్యాలతో ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు.





మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కేసీఆర్ పథకాలు ప్రజల గుండెల్లో


హామీలే తప్ప అమలు లేదు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

కాంగ్రెస్ పాలన కాదని, విధ్వంసానికి తొలి మెట్టు అంటూ రేవంత్ సర్కార్‌పై చింతా ప్రభాకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా గత 12 ఏళ్లలో లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిందని, ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చింతా ప్రభాకర్ అన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల ద్వారా 12 ఏళ్లలో 16.78 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డాక్టర్ శ్రీహరి, ఎస్‌కే రషీద్, మల్ల గౌడ్, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, వేణుగోపాలస్వామి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్తపల్లి నాని, జలంధర్, పొన్న దశరథ్‌రెడ్డి, నాయికోటి నవీన్, శ్రీకాంత్, జాఫర్, నాయకులు శ్రావణ్‌రెడ్డి, రాజేందర్ నాయక్, గోవర్ధన్‌రెడ్డి, రుక్మోద్దీన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ సిబ్బంది సేవలకు ఘన సన్మానం

మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్

అమీన్ పూర్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :

మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలను ఘనంగా సన్మానించి, అంగన్వాడీ చిన్నారులకు పుస్తకాలు, స్నాక్స్ తదితర సామగ్రిని అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. 19 అంగన్వాడీ కేంద్రాలకు అంగనవాడీ ఆయమ్మలను శాలువాలతో ఘనంగా సన్మానించి, నూతన వస్త్రాలను బహూకరించారు. అలాగే అంగన్వాడీ చిన్నారులకు పుస్తకాలు, స్నాక్స్ ఇతర అవసరమైన సామగ్రిని అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్య, పోషణ, ఆరోగ్యం, సంరక్షణ అందించడంలో టీచర్లు, ఆయమ్మలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సమాజంలో నిత్యం సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.గోదావరి అంజి రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కిష్టారెడ్డిపేటలో అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలను గుర్తించి ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. మా సేవలను గుర్తించి ఈ విధంగా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉంది. శాలువాలతో సత్కరించి నూతన వస్త్రాలు అందించడంతో పాటు మా చిన్నారులకు పుస్తకాలు, స్నాక్స్ అందించడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. మా సేవలను గుర్తించి సేవలను గుర్తించిన ఈర్ల రాజు ముదిరాజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగ ప్రతి ఒక్కరి సేవను గుర్తిస్తూ ముందుకు సాగుతాను" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మీనా గౌడ్, జిల్లా ఇన్‌చార్జి శైలజ గౌడ్, జిల్లా నాయకురాలు అనూష, జిల్లా నాయకులు అంజిరెడ్డి, కొండ లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు రాజేందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, మోర్చా అధ్యక్షులు మోహన్ నాయక్, మెహర్ ప్రసాద్, కట్ట గణేష్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు.





అనంతగిరి ఘాట్ రోడ్డులో బస్సు, బోల్తా పలుగురు దుర్మరణం





వికారాబాద్, అక్టోబర్ 3, వార్త దీపిక న్యూస్ :



బంధువుల అంత్యక్రియలకు వెళుతున్న ప్రయాణికులు, అనంతగిరి ఘాట్ రోడ్లో శనివారం ఒక ప్రైవేట్ బస్సు అదుపుతప్పి లోయలో పడిపోవడం తొ ఆ ప్రాంతమంతా విషాదచాయలు అలుముకున్నాయి. అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదంలో నలుగురు మరణించగ, అనేకమంది గాయపడ్డారు అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని,ప్రమాదం జరిగిన సమయానికి బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తుంది. డిఎస్పి అంజయ్య మాట్లాడుతూ ఘాట్ రోడ్ దిగుతున్న సమయంలో బస్సు బ్రేక్లు ఫెయిల్ కావడంతో డ్రైవరు నియంత్రణ కోల్పోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుంది. జిల్లా ఓడిఎఫ్ కేసారం ప్రాంతానికి చెందిన కొందరు ఇస్నాపూర్ లో వెల్డింగ్ పని చేస్తూ శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందిన కొత్తగాడి నారాయణరెడ్డి అంత్యక్రియలో పాల్గొనేందుకు బయలుదేరారు. నారాయణరెడ్డి స్వగ్రామం వికారాబాద్ జిల్లా దారూర్ మండల్ చింతకుంట కావడంతో బంధువులు కుటుంబ సభ్యులు మిత్రులు కలిసి ప్రైవేట్ బస్సులో చింతకుంటకు బయలుదేరారు.బస్సు వికారాబాద్ దాటి దారుర్ వైపు వెళుతుండగా అనంతగిరి ఘాట్ రోడ్ లోని ప్రమాదకర మలుపుకు వద్దకు చేరుకుంది, అదే సమయంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షిస్తూ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కూడా ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదశీ గురించి ప్రత్యేక సాక్షులతొ మాట్లాడారు. సహాయక చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బయలుదేరిన బంధువులు బస్ ప్రమాదానికి గురి కావడంతో చింతకుంట గ్రామంతో పాటు క్యసారం ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది కుటుంబ సభ్యులు రోదనలు అక్కడ ఉన్న వారిని కరిగించాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు,ప్రమాదం విషయం తెలుసుకొని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై స్పందించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతి చెందిన వారికి ఎక్స్గ్రేషియా అందేలా చూడాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశించినట్లు తెలుస్తుంది.

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984